

# కంటికి వరదొచ్చింది

పెద్దాడ
వెంకట నరసింహ మూర్తి

**గోధూళి వేళ....**

**ఏటి మీద నుండి వచ్చే చలిగాలి రివ్వున కొడుతుంటే భరించలేక కొంగుని భుజాల చుట్టూ కప్పుకుంది వసుంధర. ఆమె కాళ్లు ఆగకుండా సాగిపోతున్నాయి. ఆ ఏటి గట్టు మీద అటూ-ఇటూ అడుగు తీసి అడుగు వెయ్యాలంటే భారంగా ఉంది. అయినా ఏదో ఆశ.**

ఉండుండి పక్కనే ఉన్న రోడ్డు మీద నుండి వినవచ్చే వాహనాల శబ్దాన్ని శ్రద్ధగా ఆలకిస్తోంది. ఆ చివర నుంచి వచ్చే మనుషులని తేరిపార చూస్తోంది. ఎవరెవరో మనసంతా నిండి రూపం మాత్రం కనిపించటం లేదు.

తెగిన గాలి పటాల్లాంటి ఆలోచనలు...

వసంతం కాస్తా గ్రీష్మమైన అనుభూతి ఆమెను ఊపేస్తోంది. ఏదో తెలీని ఆవేదన -అసహాయత ఆమెని చుట్టుముడుతున్నాయి.

"శ్రీనాథ్" అనుకుందామె ఆరాటంగా.

"ఒక్కసారి నీ కౌగిలిలో కరిగిపోయి బాధలన్నీ మరిచిపోయే క్షణాలు కావాలి నాకు... వచ్చేయమ్మా త్వరగా!"

చెప్పలేని మాటల రూపాన్ని సంతరించుకోలేని భావాలు గుండె లోతుల్లోనే నిక్షిప్తమవుతున్నాయ్.

ఆమెకు ఆ ఉదయం జరిగిన సంఘటన గుర్తు కొచ్చింది. మనసంతా మరోసారి చేదు తిన్నట్టుగా అయింది.

"వస్తానన్న మనిషి కోసం నువ్వు ఎదురు చూడ్డమే గాని, అసలు వస్తానన్న విషయమైనా గుర్తుందా ఆ మనిషికి? నమ్మి సర్వస్వమూ అర్పిస్తే అవసరం తీరాక వస్తే ఏమిటి? రాకపోతే ఏమిటిలే? నువ్వేమో తగుదునమ్మా అని ఆ జ్ఞాపకాన్ని ఇదిగో ఇలా మోసుకుంటూ తిరగడమూనూ! చూసేవాళ్లకి - అడిగే వాళ్లకీ సమాధానం చెప్పలేక చచ్చిపోతున్నాను. అటు మీ నాన్న 'దాన్నేమీ అనొద్దులేవే' అంటారు. ఊరంతా సవతి తల్లి ఏమీ పట్టించుకోలేదు అంటుంది. అందరికీ మధ్య నలిగి పోలేక ఛస్తున్నా." శూలాల్లాంటి మాటలు అంటూంటే కళ్లనీరు కమ్ముకోవటం తప్ప ఏమీ చెప్పలేకపోయింది వసుంధర.

తండ్రి నిర్లిప్తంగా చూశాడామె వైపు, అతడికి తెలుసు. ఆ మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నవో!

ఆ మాటలన్నీ అక్కడలేని, ఎప్పుడొస్తాడో తెలీని, పెళ్లి నెలరోజులైన శ్రీనాథ్ గురించే.

అదంతా గుర్తుకి రాగానే వసుంధర కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి.

కాని పరిష్కారం ఏమిటో తెలీని సమస్య ఇది. మౌనంగా భరించటం తప్ప చేసేదేముంది?

సూర్యుడు పశ్చిమాద్రిలో తలదాచుకున్నాక చీకట్లు ఆకాశం నలువైపుల నుంచి దండయాత్ర చేస్తూ లోకాన్ని ఆక్రమించుకోనారంభించాయి. చలిగాలి మరింత తీవ్రమైంది. ఏటి నీళ్లు నీలి రంగులో నుంచి నలుపు రంగులోకి మారినట్టు కనిపిస్తున్నాయి. 'ఎన్ని కన్నీళ్లు దాచుకుందో - ఎంత అమాయకంగా ప్రవహిస్తోందీ ఏరు' అనిపిస్తుంది వసుంధరకి ఎప్పుడు ఆ ఏటిని చూసినా 'బహుశా స్త్రీ జాతి కన్నీళ్లన్నింటినీ ఏకం చేసుకుందేమో' అనిపిస్తోంది ఇప్పుడు.

ఆకాశంలో త్వరత్వరగా పైకి వస్తున్న చంద్రుడు వెన్నెల వెదజల్లుతున్నాడు భూదేవి ఒంటిమీద. ఒకప్పుడు ఆ వెన్నెల - విరిసిన పారిజాతం - సుమధుర ప్రేమ గీతం ప్రణయ నవనీతం.

ఇప్పుడు అదే వెన్నెల -కన్నీటి బాష్పం. బాధా పుష్పం -మండించే గ్రీష్మం.

ఎంత తేడా! ఒక్క నెలలోనే., పరిస్థితులు తారు మారయితే దృష్టికోణం కూడా మారుతుందేమో!

చేతి వాచీ చూసింది వసుంధర. టైమ్ పావు తక్కువ ఏడైంది. పట్నం నుంచి వచ్చే ఆఖరి బస్సు కూడా ఈ పల్లె దాటుకుని మీదికి వెళ్లిపోయింది.

చిన్నగా నిట్టూర్చిందామె. ఇక ఈ రోజుకి కూడా రాలేదు శ్రీనాథ్. ఏటి గట్టు మీదికి తిరుగాడుతుంటే శ్రీనాథ్ జ్ఞాపకం.... వెన్నెలని చూస్తే శ్రీనాథ్ కొంటెతనం.

చలిగాలి చుట్టుముడితే శ్రీనాథ్ అల్లరి....

అన్నీ.... ఎన్నో జ్ఞాపకానికొస్తున్నాయి.

కడుపులో కదులాడుతున్న పూర్తి నెలలు నిండిన జ్ఞాపకం ఉండుండి తన ఉనికిని గుర్తు చేస్తోంది.

'శ్రీనాథ్.... ఎప్పుడొస్తావ్?' ఆక్రోశించసాగింది వసుంధర హృదయం.

ఏడాది క్రితం పరిచయమయ్యాడు శ్రీనాథ్ వసుంధరకు. అది మరీ పల్లె -పట్నం కాని ఊరు. అక్కడ ప్రజల ఆలోచనలు, మనోభావాలు కూడా అటువంటి మధ్యస్థ స్థితిలోనే ఉంటాయి. ఒకళ్ల గురించి ఇంకొకళ్లు చాలా ఇదిగా పట్టించుకుంటారు. అదే సమయంలో పక్కవాళ్ల ఆపదలని పట్టించుకోకపోవడంలో పట్నవాసుల కేమాత్రం తీసిపోరు. అదీ విచిత్రం.

అటువంటి ఊర్లో పదో తరగతి కంటే ఎక్కువ చదవటం వీలుకాలేదు వసుంధరకు. అది కూడా అతి కష్టం మీద.

ఆడపిల్లకి చదువెందుకనే ఊర్లోవాళ్ల మనస్తత్వం వల్ల -ఊరంతటినీ ఎదిరించలేక సర్దుకుపోయే తండ్రి స్వభావం వల్ల టీచరైన తండ్రి తన కూతురు కూడా చదువుకోవాలనుకునే సాధారణమైన కోరిక వల్ల అక్కడిదాకా అతి కష్టం మీద రాగలిగింది.

ఆ తరువాత చదవాలంటే పట్నం వెళ్లాలి. తండ్రికి స్తోమత లేదు. "ఏదో తరగతితో చదువు ఆపేసింది - సవత్తల్లి దగ్గర కూడా అణకువగా ఉంటుంది. మంచిపిల్ల-" అని అప్పుడు సర్టిఫికెట్లిచ్చిన ఊరివాళ్లు అదే ఆమె అంతకు పైన, కాని పట్నం వెళ్లి చదివిన పక్షంలో 'బరితెగించింది' అని మొహమ్మీదే అనేసేవాళ్లు. ఏదేమైనా ఆ మాట ఇప్పుడు పడక తప్పలేదు వసుంధరకు.

అదీ శ్రీనాథ్ వల్ల.

శ్రీనాథ్ చాలా చిత్రంగా పరిచయమయ్యాడు వసుంధరకు. తండ్రి పనిచేస్తున్న స్కూల్లోనే టీచర్‌గా చేరిన శ్రీనాథ్‌కి ఊర్లో వసతి దొరకక స్కూల్లోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. స్కూల్లోనే తనుండటానికి కావలసిన సదుపాయం కల్పించుకునే ప్రయత్నంలో మొదటి భాగంగా చీపురుతో ఆ ప్రదేశాన్నంతా శుభ్రపరుస్తున్న సమయంలో తండ్రికి కాఫీ పట్టుకుని వచ్చింది వసుంధర. లుంగీ, బనీనుతో చీపురు పట్టుకు నిలబడ్డ అతని భంగిమ చూడగానే ఆమెకు నవ్వొచ్చింది. అప్పటిదాకా ఆ స్కూల్లో అందరూ తెలిసిన వారే.

'అతడెవరు?' అనిపించిందామెకు.

అదే ప్రశ్న అతడికీ...

'ఎవరు మీరు?' అందామె గట్టిగా -నవ్వును పెదవుల వెనకాల అదుముకుంటూ. అతడు బిత్తరపోయాడు. తన స్కూలుకి ఎవరో అమ్మాయి వచ్చి తననే ప్రశ్నించటం.

'మీరెవరు?' అదే ప్రశ్నకి జవాబు ముందుగా దొరకాలని కాసింత తీవ్రంగా వాదించుకుంటున్న సమయంలో లోపల్నుంచి అప్పుడే బయటకు వచ్చిన వసుంధర తండ్రి ఇద్దరినీ ఒకరికొకరిని పరిచయం చేశాడు.

"చూడు నాన్నా... అది ముందు చెప్పొచ్చుగా" అంది వసుంధర తండ్రి వెనుకగా నిలబడుతూ.

శ్రీనాథ్‌కి ముచ్చటేసింది. పద్దెనిమిదేళ్ల అమ్మాయి సిగ్గుపడుతూ తండ్రి సమక్షంలో దాన్ని అందంగా ప్రదర్శిస్తుంటే అతడికి అపురూపంగా తోచింది.

అదే తొలి క్షణం -బహుశా ప్రేమ పుట్టడానికి, ఆ రూపాన్ని అలా తన గుండెల్లో భద్రపరుచుకున్నాడతను. ఆ నాటి నుంచి ఆమెను ఆరాధించసాగాడు -ప్రేమించసాగాడు.

వెన్నెల ధూళిలో ప్రపంచమంతా చిత్రమైన మత్తులో మునిగిపోయి ఉంది. ఊరంతా నిశ్శబ్దపు కౌగిలిలో...

ప్రకృతి అంతా వర్ణించనలవి కానంత అందంగా ఉంది. అప్పుడప్పుడు కదిలే కొబ్బరాకులు ఏదో వింత సందేశాన్ని సంగీత రూపంలో మోసుకొస్తున్నట్లు.....

శ్రీనాథ్ -ఎదురుగా వసుంధర.

అతడు మెల్లగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

'వసూ' అన్నాడు నెమ్మదిగా. 'ఊఁ' అందామె.

ఆమెకు చాలా చిత్రంగా ఉంది. నెల్లాళ్ల క్రితం అపరిచితులమైన తామిద్దరమూ ఈ ఒంటరి వెన్నెల రాత్రి ఎన్నో జన్మల పరిచయం ఉన్నట్లు గడపటం. ఇదేనా ప్రేమంటే?

"నీకేమనిపిస్తోందో తెలీదుగాని నాకు మాత్రం నేనీ ఊరు రావటం నీ ప్రేమ కోసమేననిపిస్తోంది. నీవంటి అందాలరాశి ప్రేమ పొందటం తలచుకుంటే నా మనసును చూస్తే నాకే అసూయగా ఉంది."

ఆమె నవ్వింది చిన్నగా -వీణ మీద జాజి తీగె రాగాలు రవళించినట్లు.

"నాకూ అలాగే ఉంది. బహుశా మనిద్దరమూ కలవటం కోసమే మీరీ ఊరు వచ్చి ఉంటారు."

అతనామెను దగ్గరికి లాక్కున్నాడు. ఆ స్పర్శ ఇద్దరికీ ఏదో తెలియని అభయాన్నిస్తున్నట్టు ఉంది.

"మనం త్వరగా పెళ్లి చేసుకోవాలింక" అంది వసుంధర తన భుజం చుట్టూ మెల్లిగా బిగుసుకుంటున్న అతని చేతిని పట్టుకుని.

అతను చేతిని అలాగే ఉంచి చెప్పాడు. "ఇంకెంత, మరో ఆరు నెలలు. ఆ తరువాత మనిద్దరం భార్యాభర్తలం. ఆ పై ఏడాది తల్లిదండ్రులం."

"ఛీ...పొండి..." అందామె సిగ్గుల మొగ్గవుతూ.

"అవును వసూ! ఈ దూరం మనిద్దరినీ మరింత దగ్గర చేస్తోంది. ఇలాగే ఈ దూరం కరిగిపోయేటంత దగ్గరైపోదాం."

"ఇంకా ఆరు నెలలాగాలా? ఎందుకండి?" అంది వసుంధర శ్రీనాథ్ చెప్పిన మాటలని తలచుకుంటూ.

"మా డాడీ ఊర్లో లేరు. స్పెషల్ ట్రెనింగ్‌కి కోచ్‌గా వెళ్లారు. తిరిగొచ్చేసరికి ఆరు నెలలు పడుతుంది. ఆ తరువాత నేను మాట్లాడేయడం, నీ ముక్కుకి తాడు కట్టెయ్యడం...."

ఆమె మాటలు తన్మయంగా వింటోంది.

శ్రీనాథ్ ఆ ఊరు వచ్చిన నెల్లాళ్లలోనూ ముందుగా ఎవరిలో ప్రేమ పుట్టిందో, ఎవరు ఏ విధంగా పలకరించారో, ఏ నయన సందేశాలు పంపుకున్నారో, ఎలా మనసు తెలియజేసుకున్నారో, మమతలు కలబోసుకున్నారో ఇద్దరికీ తెలీదు. ఇద్దరూ కూడా ప్రేమ ఎలా పుట్టిందని ఆలోచించలేదు. అయినా కూడా అదో సంకల్పిత చర్య.

ఒకరోజు శ్రీనాథ్ చెప్పాడు వసుంధరతో చాలా యథాలాపంగా -"నేను నిన్ను ప్రేమిస్తున్నానంటే నువ్వేమంటావ్?"

ఆమె సిగ్గుపడిపోనూ లేదు -అక్కడి నుంచి పారిపోనూ లేదు. అంతే నెమ్మదిగా చెప్పింది. కాని స్పష్టంగా. "నేనూ అదే మాటంటాను."

అంతే! ఆ ఊరిలోని ప్రతి పిల్లగాలీ వారి ప్రేమ సందేశానికి పల్లకీలు మోసింది. ప్రతి కోకిలమ్మా వలపు వీణలే మీటింది. ప్రతి రేయి వెన్నెల వీరి కోసమే కాసింది.

నిజం! తామిద్దరూ ఒకరికోసం ఒకరు పుట్టారు.

ఇదీ శ్రీనాథ్ -వసుంధర కలిసి అనుకునే మాట.

* * *

"ఎంత పనిచేశావే పాపిష్టిదానా! ఇప్పటివరకూ ఊరిలో పరువుగా బతుకుతున్న కుటుంబాన్ని వీధిన పడేశావు కదే! అయినా ఇప్పుడు ప్రేమకీ - పెళ్లికీ తొందరొచ్చిందా? ఊరంతా ఏమనుకుంటారోనన్న ఆలోచన ఉండనక్కర్లా!"

అడ్డు అదుపూలేని సవత్తల్లి మాటలకి వసుంధర కళ్లు జలపాతాలయ్యాయి.

"నేనేం కానిపని చేశాను పిన్నీ?" అంది రోషంగా.

"ఇవ్వాళిది అయింది. రేపు ఆ కానిపని కూడా జరుగుతుంది. అయినా నిన్నని ఏం లాభంలే? మీ నాన్న పట్టించుకోరు. నేను పట్టించుకుంటే సవత్తల్లి పోరంటారు' ఆవిడలా అంటూనే ఉంది.

"అబ్బ... నువ్వూరుకోవే! ఇప్పుడేం జరిగిపోయిందని? అయినా శ్రీనాథ్ కూడా గుణవంతుడూ, యోగ్యుడునూ, నేనెళ్లి అతనితో మాట్లాడతానుగా." తండ్రి చెప్పాడు.

"మీ ఖర్మ. ఎవరెలా పోతే నాకేం. నాకే హక్కుందని. ఇవాళ్టి నుండి ఇంట్లో ఏం జరిగినా నేనేం పట్టించుకోను.



## రజనీకి స్వర్ణ కంకణం

అరవై అయిదేళ్ల చలన చిత్ర చరిత్రలో 'పెదరాయుడు' చిత్రం కనీవినీ ఎరుగని రీతిలో కలెక్షన్లు సాధించి సరికొత్త రికార్డును సృష్టించింది. అంతేకాదు- ఆ చిత్రం ద్విశతదినోత్సవ వేడుకలను కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు భారీ ఎత్తున ఇటీవల జరిపారు. ఈ చిత్రంలో కొద్దిసేపే కనిపించినా సూపర్‌స్టార్ రజనీకాంత్ బాగా గుర్తుండిపోయేలా నటించారు. అందుకేనేమో ఈ చిత్రోత్సవంలో మోహన్‌బాబు జైపూర్ నుంచి స్వర్ణ కంకణాన్ని ప్రత్యేకంగా తెప్పించి రజనీకి తొడిగించారు.

**సేకరణ: శర్మ సిహెచ్(విజయవాడ)**



## 'బాబు'కిద్దరు

గతంలో హీరో శోభన్‌బాబు సినిమా అంటే తప్పనిసరిగా ఇద్దరు హీరోయిన్లు ఉండేవారు. ఇద్దరితో ఆడి, పాడి ప్రేమించి చివరలో ఒక హీరోయిన్ మరణించడం ద్వారా కథను సుఖాంతం చేసేవారు. ఇప్పుడు అదే ఆనవాయితీకి హీరో జగపతిబాబు శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. 'శుభలగ్నం' చిత్రం దగ్గర్నుంచీ ఆయనకు ఇద్దరు హీరోయిన్లు తప్పనిసరిగా ప్రతి సినిమాలో ఉంటున్నారు. కాబట్టి శోభన్‌బాబు వారసత్వం జగపతిబాబుకు దక్కిందనుకోవాలి. అదీకాక ఇద్దరి పేర్లలో చివరా 'బాబు' ఉండడం కూడా విచిత్రంగా లేదూ?

**సేకరణ: శర్మ సిహెచ్(విజయవాడ)**

ఎవరిష్టమొచ్చినట్టు వాళ్ళు ఉండండి." చెప్పి విసవిసా వెళ్ళిపోయిందక్కడి నుంచి.

వెక్కుతున్న వసుంధర దగ్గరకు వచ్చాడు ఆమె తండ్రి.

"మీ పిన్ని సంగతి నీకు తెలుసుగా తల్లీ! గోరంతని కొండంత చేస్తుంది. నువ్వేం బాధపడకు. నేనున్నాగా. శ్రీనాథ్‌తో మాట్లాడి మీ పిన్నికి నేను చెప్తానులే" అన్నాడు.

"నాన్నా!" అంది వసుంధర తండ్రి గుండెల్లో వాలిపోయి.

"పిచ్చిపిల్ల" ఆప్యాయంగా ఆమె తల నిమిరాడు ఆయన.

సవత్తల్లి చెప్పిన మాట నిజమే!

ముందే చెప్పినట్టు పక్కవాళ్లని ఎప్పుడూ రంగు టద్దాలలో నుంచే చూడటం అలవాటు చేసుకున్న ఆ ఊరివాళ్ల నుంచి 'శ్రీనాథ్, వసుంధర' ప్రేమాయణానికి కూడా మినహాయింపేమీ దక్కలేదు. ప్రేమించటం అంటే బరితెగించటమనే అభిప్రాయమున్న ఆ ఊరి జనానికి ఈ జంట సంఘపు తరతరాల సంప్రదాయాలను ఛేదించుకున్నట్లు కనబడుతూనే ఉంది.

ఆ ఊరిలోని పెద్ద మర్రి చెట్టు దగ్గర్నుంచి పేరంటం దాకా ప్రతి ఇద్దరూ చేరే చోట వీరి ప్రేమే చర్చనీయాంశం అయింది. శ్రీనాథ్ కాని, వసుంధర కాని కనబడితే చెవులు కొరుక్కునేవారు. కొందరైతే వెకిలి నవ్వుతో మొహామ్మీదే "పంతులుగారు పప్పన్నం ఎప్పుడు పెడతారో" అని అడిగేవారు కొందరు.

ఎంతైనా వసుంధర ఆడపిల్ల.

ఇటువంటి అనుభవాలు ఆమెకు అసహనంగా ఉండి ఆవేదన పెంచేవి.

"చూడు వసూ! ప్రేమించటమంటే నేరమో, ఘోరమో అనుకునే వీళ్లకి జవాబు చెప్పాల్సిన అవసరం మనకి లేదు. కాలమే చెబుతుంది. మన పెళ్లితో వీళ్లందరి నోళ్లూ మూతబడతాయి" అంటూ మృదువుగా నచ్చచెప్పే శ్రీనాథ్ మాటలు ఆమెను కొంతలో కొంత సాంత్వన పరిచేవి.

ఏది ఏమైనా వసుంధరని ఊరంతా కొత్తగా చూడటం మొదలు పెట్టింది. బొత్తిగా బరితెగించినదానిలా.

ఒకరోజు...

తండ్రి - సవత్తల్లి కలిసి బంధువులింట్లో పెళ్లని పక్క ఊరు వెళ్లారు. అది సవత్తల్లి తరపు వారిదెవరిదో. అందుచేత వసుంధర తనే రానంది. శ్రీనాథ్ కూడా ఇంటికి వెళ్లాడు. తల్లితో పెళ్లి విషయం మాట్లాడతానని వెళ్లి నాలుగు రోజులైంది.

రాత్రయింది. ఒక్కతే బిక్కు బిక్కుమంటూ ఇంట్లో కూర్చుంది వసుంధర. చిక్కని చీకటి పరదాలో నిశ్శబ్దం స్వైర విహారం చేస్తోంది. తలుపు చప్పుడవడంతో మంచం మీద నుంచి లేచి వెళ్లి అడిగింది.

"ఎవరూ?"

"నేనే వసూ!" బయట నుండి శ్రీనాథ్ గొంతు వినిపించింది. చప్పున తలుపు తీసింది వసుంధర.

"ఇంట్లో ఎవరూ లేరా వసూ?" అంటూ లోపల కొచ్చాడతను.

చెప్పింది.

"మీరేమిటి ఇంత రాత్రివేళ వచ్చారు?"

"మధ్యాహ్నమే బయల్దేరాను. దార్లో బస్సు ట్రబుల్.'

"మాట్లాడారా?" ఆత్రుతగా అడిగింది వసుంధర.

"ఏమిటి?"

"అదే మన పెళ్లి విషయం."

"అమ్మాయిగారికి పెళ్లంటే చాలా తొందరగా ఉన్నట్టుందే." ఆమెను ఒడుపుగా తన చేతుల్లోకి లాక్కుని బంధించాడతను. తరువాత చెప్పాడు.

"ఇంట్లో బంధువులొచ్చారు. వీలవలేదు. అయినా మా డాడీ రావటానికి మరో నాలుగు నెలలు పడుతుంది. ట్రైనింగ్ వ్యవధి పెంచారట. మనమింకో తొమ్మిది నెలలాగక తప్పదు."

"అబ్బ." అంది వసుంధర. "అంతకాలం ఊర్లోవాళ్ల వాడి చూపులను తట్టుకుంటూ బతగ్గలనా?"

"పోనీ ఓ పని చేద్దామేమిటి? ఎలాగూ మనకు తొమ్మిది నెలల టైముంది కదా! ఈలోగా మన కార్యక్రమాన్ని ముగించామనుకో. అప్పుడింక పెద్దవాళ్లే మన పెళ్లికి తొందరపడతారు." కొంటెగా అన్నాడు శ్రీనాథ్.

"ఎలా?" అర్థంకాలేదు వసుంధరకు.

"చాలా తేలిక. మనమో మనవడ్ని ప్రజెంట్ చేశామనుకో..." శ్రీనాథ్ మాటలింకా పూర్తికాలేదు. వసుంధర అతడి నోరు మూసేసింది.

"ఛీ... ఛీ..." అంటూ..

"ఛీ..ఛీ.. ఎప్పుడైనా ఉండేదేగా. కాకపోతే మనమింకా అడ్వాన్స్ అవుతాం. ఊర్లోవాళ్లు మరింత గాభరాపడి ఛస్తారు." గట్టిగా నవ్వాడు శ్రీనాథ్.

"ఛీ... పోండి." అతన్ని తోసేసి అవతలి గదిలోకి పరిగెత్తింది వసుంధర. వెనకే తనూ వెళ్లాడు శ్రీనాథ్.

పరిగెడుతున్న వసుంధర పైటకొంగు శ్రీనాథ్ చేతులకి అందింది.

గదిలో నీలిరంగు బల్బు మసక వెలుతురుని నిస్తేజంగా ప్రసరిస్తోంది. రివ్వున వీస్తున్న గాలి శబ్దం.

గోడని తాకుతూ కదులుతున్న పెరట్లోని కొబ్బరాకులు వికృతంగా శబ్దం చేస్తున్నాయి. టైమ్ రాత్రి రెండవుతోంది.

"వసూ!" నెమ్మదిగా పిలిచాడు శ్రీనాథ్. జవాబు రాలేదు. ఆమె ఏడుస్తున్నట్లు కదులుతున్న ఆమె శరీరం, అప్పుడప్పుడు వినబడుతున్న వెక్కిళ్లు చెబుతున్నాయి.

శ్రీనాథ్ లేచి వసుంధర తల పైకెత్తి ఆమె కళ్లు తుడిచాడు.

"ఊరుకో వసూ! ఇప్పుడేం జరిగిందని? నువ్విలా ఏడుస్తూ కూచుంటే తప్పు చేసినట్లు నేను బాధపడాల్సి వస్తుంది. ఇవాళ కాదు ఏనాటికైనా నువ్వూ - నేనూ భార్యాభర్తలమే. నన్ను నమ్మవూ?" ఆమె ఏమీ మట్లాడలేదు.

"ప్లీజ్ మాట్లాడు వసూ. నీ మౌనం నన్ను మరింత బాధిస్తోంది."

"నేను మిమ్మల్ని నమ్ముతానండీ. కానీ లోకానికి మనిద్దరినీ నమ్మాల్సిన అవసరం లేదు.అనుమానించటమే దాని పని. ప్రేమించుకుంటేనే ఇంత గగ్గోలు పెట్టిన ఊరు పెళ్లికి ముందే తొందరపడ్డామని తెలిస్తే..."

"ఏమంటుంది? అయినా మన జీవితం మన ఇష్ట ప్రకారం నడవాలి వసూ! ఎప్పుడు ఏమవుతుందోనని ఎవరేమనుకుంటారోనని అనుక్షణం బాధపడితే ఈ జీవితాన్నెప్పుడూ అనుభవించలేం."

"కానీ నాకూ భయంగా ఉందండీ."

వసుంధర నెమ్మదిగా అంది.

"ఒక్క నిముషం" అంటూ దేముడి గదిలోకి వెళ్లి పసుపు కొమ్ము తెచ్చి దారం కట్టి "ఇదే మంగళసూత్రం వసూ! ఇదిగో దేముడి ఎదురుగా కడుతున్నాను. ఆయనే మనకు సాక్షి. అగ్నిహోత్రాలు, బంధుమిత్రులు లేరని బాధపడకు. ఇది కడుతున్నది నీకోసం. నా మీద నీకు నమ్మకం ఉండడానికి. లోకమంతా ఏమన్నా భరిస్తాను వసూ! కాని నువ్వు కూడా..." అతని కంఠం రుద్ధమైంది.

"ఛ...అదికాదండి" ఏదో చెప్పబోయింది వసుంధర.'

"సొన్లే వసూ! అదంతా వదిలెయ్. ఇప్పుడు మనం భార్యాభర్తలం. ఆ మాట ఒప్పుకుంటావా?"

నెమ్మదిగా తలూపింది వసుంధర. తడిసిన కళ్లు నైట్ బల్బు వెలుగులో ముత్యాల్లా మెరిశాయ్.

"ఇక నేనేం చేసినా కాదనకు." ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాడతను. అతని కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది వసుంధర.

బయట చీకటి నెమ్మదిగా కరుగుతోంది.

ఊరు నిద్రలేవటానికి సిద్ధమవుతోంది.

ఆ చీకటి రాత్రి -ఆ తరువాత శ్రీనాథ్‌తో గడిపిన వెన్నెల రాత్రులు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించి వసుంధరని గర్భవతిని చేశాయి.

* * *

"నేనానాడు చెబితే విన్నారూ! ఏమవుతుంది - ఏమవుతుంది అంటూ వెనకేసుకు వచ్చారు. ఇప్పుడ నుభవించండి." సవత్తల్లి మొదలు పెట్టింది. తండ్రి కూడా ఏమీ అనలేకపోతున్నాడు. వసుంధరకి మౌనమే శరణ్యమైంది.

శ్రీనాథ్ పట్నం వెళ్లాడు ఏదో పని మీ. ఇంకా ఈ వార్త అతనికి తెలియదు. రోజు రోజుకీ సవత్తల్లి మాటలు ఎక్కువవుతున్నాయ్. ఏడుపు తప్ప వసుంధరకి వేరే తోడు లేదు. ఓదార్చేవారూ లేరు. తండ్రి నిర్లిప్తంగా చూస్తాడు.

ఆరు నెలల దాకా దాచినా ఎలా తెలిసిందో ఏమో కాని ఊరంతటికీ ఈ వార్త తెలిసింది. చాలా మంది నీతి సూత్రాలు -ధర్మపన్నాలు వల్లెవేశారు. మరికొందరు ఏదో మిష మీద ఇంటికొచ్చారు.

"ఏమిటొదినా బొత్తిగా కనిపించడం లే"దంటూ ఆ మాటా -ఈమాటా చెప్పి "మొత్తం మీద పప్పన్నం పెట్టకుండానే మనవణ్ని అందుకోబోతున్నావ్. బారసాల కన్నా పిలుస్తావా?" అంటూ మాటలు విసిరి వెళ్లారు.

ఆ మాటలు విని రెచ్చిపోయిన సవత్తల్లి అనే మాటలతో వసుంధరకి చచ్చిపోవాలనిపించేది.

అలాంటి సమయంలో వచ్చాడు శ్రీనాథ్. అతని గుండెల్లో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడ్చేయసాగింది వసుంధర.

"అగ్నిసాక్షిగా పెళ్లవకపోయినా మేము భార్యాభర్తలమే. ఇంకో మూడు నెలల్లో మా డాడీ ఢిల్లీ నుంచి రాగానే పెళ్లి చేసుకుంటాను. అంతవరకూ మీకు బరువైతే మా అమ్మ దగ్గరికి తీసికెళ్లిపోతాను వసూని." గట్టిగా చెప్పాడు వసుంధర సవత్తల్లితో.

"ఏదో ఏా అనుమానం కొద్దీ, మా పిల్ల మాకు బరువా?" నసిగింది సవత్తల్లి. తండ్రి కూడా శ్రీనాథ్ చెప్పిన మాటలకి ఒప్పుకున్నాడు.

ఊరంతా తాత్కాలికంగా నోరు మూసుకుంది.

శ్రీనాథ్ దగ్గరుండి వసుంధరని పసిపాపలా చూసుకునేవాడు.

పుట్టబోయే పిల్లాడి గురించి ఎన్నో కబుర్లు చెప్పేవాడు. మురిసిపోయేవాడు.

రోజులు ఆనందంగా గడవసాగాయి ఆమెకి. నెలలు నిండసాగాయి. ఒకరోజు తన తండ్రికి రెండ్రోజుల్లో వస్తాడని చెప్పి పట్నం వెళ్లాడు.

వెళ్లి నెల్లాళ్లు దాటుతున్నా రాలేదు. ఎటువంటి కబురూ కూడా లేదు. మళ్లీ వేదన - ఏడుపు - నిరీక్షణ - వసుంధర.

మరో పదిహేను రోజులు గడిచాయి. శ్రీనాథ్ రాలేదు.

శ్రీనాథ్ మిగిల్చిన గుర్తు ఊపిరిపోసుకుని భూమ్మీద పడింది. ఒక పలకరింపు లేదు. ఒక ముద్దు మాట లేదు. ఒక మురిపెం లేదు. తెలియని లోకం నుంచి ఈ లోకానికి తొలిసారి వచ్చిన అతిథికి. ఊరివాళ్ల మాటలు భరించలేక తండ్రి బయటకు వెళ్లడం మానుకున్నాడు.

అంతా నిర్లిప్తత...నిర్లిప్తత!

తుఫానుకు ముందు ప్రశాంతి లాంటిది!

ఎవరెవరో ఇంటికి వచ్చి ఉచిత సలహాలు ఇస్తున్నారు. పట్నం వెళ్లి శ్రీనాథ్‌ని కలవమని. కాని అడ్రస్ ఏది? తన చిరునామాయే అతనిది అనుకుంది. కాని అతని చిరునామా వెతికే రోజు వస్తుందని అనుకోలేదు కదా!

ఇంతలో ఇంకో వార్త. పల్లె నుంచి పట్నం వెళ్లిన ఎవరో శ్రీనాథ్‌ని ఇంకో అమ్మాయితో చూశాడట. నిజమో, అబద్ధమో. ఏది నమ్మాలో, నమ్మకూడదో తెలీని పరిస్థితి.

ఊరంతా కుటుంబాన్ని వెలివేసినట్లు చూడసాగింది.

వసుంధర కళ్లు ధారాపాతంగా వర్షిస్తూనే ఉన్నాయి.

నిర్లిప్తత కాస్తా నిర్వేదమై -జీవితం నిశ్చలమై - నిస్తేజంగా నిర్విరామంగా కన్నీళ్లు నిశ్శబ్దంగా వర్షిస్తూ ఉంటే పుట్టుకొచ్చిన నిరాశ కాస్తా వేదాంతమై ఒక కొత్త నిర్ణయాన్ని ఆహ్వానించింది.

తండ్రికి బరువుగా ఊరి వాళ్ల సూటిపోటి మాటలను తట్టుకుంటూ ఎందుకీ బ్రతుకు తన వాడనుకున్నవాడే మోసం చేశాక?

నిర్ణయం బలీయమవగానే ఏదో కొత్త ఆకాశం ఆమెని చుట్టుముట్టింది.

ఊరంతా నిశ్శబ్దంలో ఉండగా గలగల పారుతున్న ఏటి వద్దకు నడిచింది - చేతుల్లో బాబుతో.

నెమ్మదిగా పిల్లాడ్ని ఏటి తల్లి ఒడిలో వదిలింది.

ఊర్లోని కల్మషంతో పాటే కల్మషమైన ఊరివాళ్ల నోళ్లలో నానిన పిల్లాడు పునీతమవ్వటానికి ఏటితోపాటు వెనక్కి - ఇంకా వెనక్కి వెళ్తున్నాడు.

తనూ దిగబోయింది. వెనకాలే ఓ చెయ్యి ఆపింది. చూస్తే తండ్రి.

"నన్ను వదిలెయ్ నాన్నా...నేను బ్రతకలేను." గింజుకుంటూ ఏడవసాగింది. ఆమెని గట్టిగా పట్టుకుని పిల్లాడి కోసం చూడసాగాడు చీకట్లో.

* * *

"వచ్చేశాను వసూ! మా డాడీతో మాట్లాడాను. ఒప్పించాను. వచ్చే వారమే మన పెళ్లి." రాగానే వసుంధర చెయ్యి పట్టుకుని ఊపుతూ ఆనందంగా అన్నాడు శ్రీనాథ్.

వసుంధర నిస్తేజంగా చూసిందతని వైపు.

"అదేమిటి వసూ, మాట్లాడవేమిటి? ఆలస్యమైందని కోపమా? ఏం చెప్పమంటావ్, ట్రైన్ ఏక్సిడెంట్‌లో గాయపడ్డ మా డాడీ కోలుకోవటానికి ఇన్నాళ్లు పట్టింది. అందువల్ల రాలేకపోయాను. సారీ! ఇక నిన్నొదలి ఎటూ వెళ్లనుగా. ఇక మనకన్నీ మంచి రోజులే." గబగబా చెబుతున్నాడతను.

అప్పుడే గుర్తొచ్చినట్లు ఆమె వైపోసారి చూసి "అన్నట్లు బాబేడి వసూ?" అన్నాడు.

అప్పటిదాకా నిగ్రహించుకున్న వసుంధర ఇక ఆపుకోలేక అతని గుండెపై వాలిపోయి భోరున ఏడ్వసాగింది.

శ్రీనాథ్ అయోమయంగా అర్థంకానట్టు చూశాడు. ఉయ్యాల లేని గది వంక.

కండువాతో కళ్లు తుడుచుకుంటున్న వసుంధర తండ్రి వంక...

కళ్లొత్తుకుంటున్న ఆమె సవత్తల్లి వంక....

భారం దింపుకున్న వసుంధర వంక...

పసిపాప ఏడుపు వినిపించని ఆ ఇంటి వంక...

ఏదో అర్థమై నిల్చొనే శక్తిలేక నేల మీద కూలబడ్డాడు.

అతని కళ్లు సుడిగుండాలయ్యాయి.

●

